ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
బుధవారం 24 ఏప్రిల్ 2024





కొండగట్టులో కిక్కిరిసిన జనం

కొండగట్టు కాషాయమయం

7లో..



- ఘనంగా హనుమాన్ చిన్న జయంతి
- అంజన్నకు భక్తజన హారతి
- స్వామిని దర్శించుకున్న వేలాది భక్తులు

'కొండ'ంతా కాషాయమయమైంది.. చిన్నహనుమాన్ జయంతి సందర్భంగా మంగళవారం కొండగట్టుకు భక్తులు పోటెత్తారు. ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల నుంచి మాల విరమణ చేసేందుకు దీక్షా పరులు వేల సంఖ్యలో కొండకు చేరుకోగా ఘాట్‌రోడ్డు, మెట్లదారి భక్తజన సంద్రమైంది. -మల్యాల

భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి



ధర్మపురి ప్రసన్నాంజనేయ స్వామి వారికి క్షీరాభిషేకం



వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ, నాయకులు



ధర్మపురి ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో భక్త జన సందడి

- వేలాదిగా తరలి వచ్చిన దీక్షా పరులు
- ఆలయాల్లో పెరిగిన రద్దీ

ధర్మపురి, ఏప్రిల్ 23: ధర్మపురిలో హనుమాన్ జయంతి ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి, గడ్డ ఆంజనేయస్వామి, హనుమాన్‌వీధి ఆలయాల్లో, చింతామణి చెరువు వద్ద భక్త జన సందడి నెలకొంది. సుదూర ప్రాంతాల నుంచి తరలి వచ్చిన వేలాది మంది హనుమాన్ దీక్షా పరులు, భక్తులతో క్షేత్రం రద్దీగా మారింది. ఉదయం శ్రీ లక్ష్మీ నృసింహస్వామి అనుబంధ ఆలయాల వద్ద ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, ముత్యాలశర్మ ప్రత్యేక పూజలు జరిపారు. గోదావరి నది తీరాన గడ్డ ఆంజనేయ స్వామి వారలకు పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుంచే గోదావరి నదిలో స్నానాలు చేసి భక్తులు ఆలయాలకు చేరుకుని స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పలు చోట్ల భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ధర్మపురి ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, బుగ్గారం జడ్పీటీసీ బాదినేని రాజేందర్, వైస్ చైర్మన్ ఇందారపు రామయ్య, టీపీసీసీ సభ్యులు దినేష్, రవీందర్, ఆలయ సూ పరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీని వాస్, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి పాల్గొన్నారు.

జగిత్యాల టౌన్: జిల్లా కేంద్రంలోని హనుమాన్ ఆలయాల్లో చిన్న హనుమాన్ జయంతిని భక్తులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పలు ఆలయంలో వేద పండితుల ఆధ్వర్యంలో లోక కల్యాణార్థం హోమం నిర్వహించారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పలు ఆలయాల్లో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. గుండు హనుమాన్ విగ్రహం వద్ద అన్నదాన కార్యక్రమానికి వేలాది మంది భక్తులు హాజరయ్యారు. కౌన్సిలర్ పంబాల రాము ఉన్నారు.

కొడిమ్యాల: మండల కేంద్రంలోని వాగు ఒడ్డున ఉన్న ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేశారు. వేములవాడ నుంచి వేలాదిగా కాలినడకన కొండగట్టు ఆంజ నేయస్వామి దర్శనానికి తరలివస్తున్న దీక్షా పరులకు మండలంలోని చెప్యాల ఎక్స్ రోడ్డు వద్ద దొంగలమర్రి పోలీస్ చెక్ పోస్ట్ సమీపంలో మండల బీజేపీ నాయకులు హన్మాన్ దీక్షా పరులకు పండ్లను, మజ్జిగను పంపిణీ చేశారు.

మల్యాల: మండలంలో హనుమాన్ జయంతి వేడుక లు ఘనంగా జరుపుకున్నారు. మల్యాలలోని ఆదపె ర్మాండ్ల ఆలయం, మఠమాంజనేయస్వామి, మార్కండేయ ఆలయంలో జయంత్యుత్సవాలు ఘనంగా నిర్వహించారు. మల్యాలలో భక్తులు శోభాయాత్ర నిర్వహించారు.

పెగడపల్లి : మండలంలోని బతి కెపల్లి కొచ్చెరువు గట్టు అంజన్న ఆలయం, పెగడపల్లి మండల కేంద్రంలోని పాటిమీది అంజన్న ఆలయం, భక్త మార్కండేయ ఆలయం, కీచు లాటపల్లి అంజన్న ఆలయాలతో పాటు పలు గ్రామాలలోని ఆలయాలలో వేకువ జామునుండే భక్తులు అంజన్నను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. బతికెపల్లిలో నాగరాజు శ్రీనివాసాచార్య, మధుసూదనాచార్య, పెగడపల్లిలో గుండి రాజేశ్వరశర్మల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

రాయికల్: రాయికల్ పట్టణంలో మంగళవారం హనుమాన్ జయంతి వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. గుడేటి రెడ్డి యువజన సంఘం ఆధ్వర్యంలో పాత హనుమాన్ మందిరంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కుల పెద్దలు రాజేందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, తిరుపతి, నారాయణ, రవి, మల్లారెడ్డి, గంగారెడ్డి పాల్గొన్నారు.

గొల్లపల్లి : మండలంలో హనుమాన్ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఆలయాలను భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆంజన్న భక్తుల హనుమాన్ సంకీర్తనలతో, అంజన్న నామస్మరణలతో ఆయా ఆలయాలు మార్మోగాయి.

మెట్‌పల్లి : పట్టణంలోని కోందడ రామాలయం, హనుమాన్ ఆలయాల్లో స్వామి వారి జయంతి వేడుకలను నిర్వహకులు ఘనంగా జరిపారు. పట్టణంలోని కాశీ బాగ్ హనుమాన్ ఆలయంలో స్వామి వారిని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు పాల్గొనగా పురోహితులు, నిర్వహకులు ఘన స్వాగతం పలికారు. ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.

మల్లాపూర్ : మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో స్వామి వారి శోభాయాత్రను నిర్వహించారు. ముత్యంపేటలోని నీలగిరి హనుమాన్ ఆలయంలోని స్వామి వారిని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, రాఘవపేటలోని స్వామి వారిని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యా సాగర్‌రావు దర్శించుకున్నారు.

కోరుట్ల : పట్టణంలోని పలు వార్డులలో ఆంజనేయస్వామి దేవా లయాల్లో మంగళవారం జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని కల్లూర్ రోడ్డులో ఉన్న అభయ ఆంజనేయ స్వామి దేవాలయ వార్షికోత్సవంతో పాటు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, మున్సిపల్ చైర్మెన్ అన్నం లావణ్య - అనిల్ పూజలలో పాల్గొన్ని అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. పట్టణంలోని ప్రకాశం రోడ్డులోని అభయ ఆంజనేయస్వామి దేవా లయంలో జయంతిని ఘనంగా నిర్వహించారు. కోరుట్ల కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జు జువ్వాడి నర్సింగరావు, మైనింగ్ కార్పొరేషన్ చైర్మెన్ ఈరవత్రిని అనిల్ కుమార్ ప్రత్యేక పూజలలో పాల్గొన్ని అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించారు. వేదపండితులు ప్రత్యేక వేదికపై రాములోరి కళ్యాణం నిర్వహించారు. ఆంజనేయ స్వామికి 11,111 వేల వండలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ గడ్డమీది పవన్, కౌన్సిలర్స్ ఎంబేరి నాగభూషణం, మోర్తాడ్ లక్ష్మీనారాయణ కాంగ్రెస్ నాయకులు ఆడెపు మధు, ప్రభాకర్, సోగ్రబీ, కవిత, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్ : మండలంలోని ఆయా గ్రామాలలో మంగళవారం అంజనేయ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అయిలాపూర్, చిన్నమెట్‌పల్లి గ్రామాలలోని అంజనేయ స్వామి దేవాలయాలలో ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు.



కోరుట్లలో ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న జువ్వాడి నర్సింగరావు, నాయకులు



బండలింగాపూర్ గండిహనుమాన్ ఆలయంలో..

కరీంనగర్ లోక్‌సభ స్థానానికి 12 నామినేషన్లు

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 23: కరీంనగర్ లోక్‌సభ స్థానం నుంచి పోటీచేసేందుకు 12 మంది అభ్యర్థులు నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పమేలా సత్పతికి అందజేశారు. మంగళవారం 12 మంది నామినేషన్లను దాఖలు చేయడంతో కలెక్టరేట్‌లో రాజకీయ సందడి నెలకొన్నది. ఇందులో ముగ్గురు అభ్యర్థులు రెండో సెట్ నామినేషన్ పత్రాలను అందజేయగా, తొమ్మిది మంది మొదటి నామినేషన్లను సమర్పించారు. స్వతంత్ర అభ్యర్థులుగా జహీదా బేగం, పెద్దపల్లి శ్రావణ్, కట్యూరి ఎనోస్, మేకల అక్షయ్‌కుమార్, గుడిసె మోహన్, సూరం చంద్రశేఖర్, పేరాల మానసరెడ్డి నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందజేశారు. సోషల్ జస్టిస్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా పంచిక అశోక్ రెండు సెట్ల నామినేషన్లను అందజేశారు. నేషనల్ నవ క్రాంతి పార్టీ అభ్యర్థిగా కడ్తాల అనిల్‌రెడ్డి నామినేషన్ వేశారు. ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులు కోట శ్యాంకుమార్, పిడిశెట్టి రాజు, పొత్తూరి రాజేందర్‌లు ఇప్పటికే మొదటి నామినేషన్ వేయగా మంగళవారం రెండో సెట్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందజేశారు.

నిజామాబాద్‌లో కొనసాగుతున్న ప్రక్రియ

- మంగళవారం 16 నామినేషన్ల దాఖలు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 23 : పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గానికి మంగళవారం 16 నామినేషన్లు దాఖలయ్యాయి. బహుజన లెఫ్ట్‌పార్టీ అభ్యర్థిగా అశోక్‌గౌడ్, ఆల్ ఇండియా బీసీ ఓబీసీ పార్టీ అభ్యర్థిగా పోతు నవీన్, ప్రజాసేన పార్టీ అభ్యర్థిగా పోతు నాగార్జున్, ఆల్ ఇండియా నేషనల్ పార్టీ అభ్యర్థిగా ఎండీ షాహెద్ ఖాన్, దళిత బహుజన పార్టీ అభ్యర్థిగా గోలి నరేష్ నామినేషన్లు వేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా కొత్తకొండ శక్తిప్రసాద్, బీబీ నాయక్, మహ్మద్ జమీల్, జి. సాయికృష్ణమూర్తి నామినేషన్లు వేశారు. ఇప్పటికే స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు వేసిన రాపెల్లి సత్యనారాయణ రెండవ సెట్, రాపెల్లి శ్రీనివాస్ మూడవ సెట్ నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజీవ్ గాంధీ హన్మంతుకు అందజేశారు. ధర్మసమాజ్ పార్టీ అభ్యర్థిగా కండెల సుమన్ మూడవ సెట్ నామినేషన్‌లను దాఖలు చేశారు. వీరితో పాటు అలయన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ పార్టీ అభ్యర్థిగా యుగందర్‌గట్ల, యుగ తులసి పార్టీ అభ్యర్థిగా కోటగిరి శ్రీనివాస్, విద్యార్థుల రాజకీయ పార్టీ అభ్యర్థిగా బూక్యానంద్ మూడవ సెట్, స్వతంత్ర అభ్యర్థిగా కాట్రాజు ప్రశాంత్ రెండవ సెట్ నామినేషన్లు వేశారు. నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి ఇప్పటి వరకు 26 మంది అభ్యర్థులు 44 నామినేషన్లు దాఖలు చేసినట్లు రిటర్నింగ్ అధికారి రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు.

పెద్దపల్లిలో మరో పదకొండు మంది...

33కు చేరుకున్న అభ్యర్థుల సంఖ్య

పెద్దపల్లి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి (ఎస్సీ రిజర్వుడు) పార్లమెంటు స్థానానికి మంగళవారం మరో 11 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. దీంతో ఇప్పటి వరకు అభ్యర్థుల సంఖ్య 33కు చేరుకున్నది. స్వతంత్ర అభ్యర్థులుగా దూడ మహిపాల్ (రెండవ సెట్), తాళ్లపల్లి నరేష్, రాచర్ల రాజేశం, ఇరికిల్ల రాజేష్, కట్కూరి సందీప్ (రెండవ సెట్), సోల్లు రంజిత్, యువతరం పార్టీ అభ్యర్థిగా చిలుక ఆనంద్, పీపుల్స్ పార్టీ ఆఫ్ ఇండియా (డెమోక్రటిక్) అభ్యర్థిగా మోతె నరేష్ (రెండవ సెట్), అలియన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫామ్స్ పార్టీ అభ్యర్థిగా అంబోజు సుమలత, బీఎస్పీ అభ్యర్థిగా ఇరుకుల్ల రాజ నర్సయ్య , సోషలిస్టు పార్టీ ఇండియా) అభ్యర్థిగా ములకల కనకయ్య తలా ఒక సెట్ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారని, ఇప్పటి వరకు ఐదు రోజుల్లో 33 మంది అభ్యర్థులు 42 సెట్లలో నామినేషన్‌లు దాఖలు చేసినట్లు పెద్దపల్లి పార్లమెంటు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. నామినేషన్ల దాఖలుకు ఈ నెల 25వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు సమయం ఉంది. బీజేపీ అభ్యర్థి గొమాసే శ్రీనివాస్ బుధవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు.

సీసీ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ

- ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్
- చిన్న జయంతి ఉత్సవాల బందోబస్తు పరిశీలన



పోలీస్ అధికారులతో ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

మల్యాల, ఏప్రిల్ 23: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో జరుగుతున్న హనుమాన్ చిన్న జయంతి ఉత్సవాలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసి సీసీ కెమెరాలతో నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. చిన్న జయంతి సందర్భంగా కొండగట్టు వచ్చిన ఎస్పీ భద్రత ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ కాలినడకన వచ్చే భక్తులకు రోడ్లపై ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా రేడియం స్టిక్కర్లను ఏర్పాటు చేశామన్నారు. ఎస్పీ వెంట అదనపు ఎస్పీలు వినోద్‌కుమార్, భీమ్‌రావు, డీఎస్పీలు రఘుచందర్, ఉమామహేశ్వర్‌రావు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు సీఐ నీలం రవితో పాటు ఎస్సైలు, దేవస్థానం ఈవో చంద్రశేఖర్ ఉన్నారు.

ఉత్తమ సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు

జగిత్యాల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి):ఉత్తమమైన సేవలతోనే ఉద్యోగులకు ప్రజల్లో గుర్తింపు లభిస్తుందని జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని గర్ల్స్ హైస్కూల్‌లో జరిగిన ప్రధానోపాధ్యాయుడు గడ్డం బాల కిషన్ పదవీ విరమణోత్సవానికి ఆయన హాజరయ్యారు. పదవీ విరమణ పొందిన బాల కిషన్‌ను సన్మానించారు. పదవీ కాలంలో ఉద్యోగులు ఇచ్చిన సేవలు ప్రజల్లో చిరకాలం నిలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామానుజం, కరుణాకర్, జయశ్రీ, ఉమారాణి, కమలాకర్ రెడ్డి, రాజేందర్, రజాక్, తపాస్ నాయకులు దేవయ్య పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో నాలుగు రోజుల జైలు శిక్ష

జగిత్యాల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హనుమాన్ వాడకు చెందిన కొండ్ర కల్యాణ్ అను వ్యక్తి మద్యం సేవించి అజాగ్రత్తగా వాహనం నడపడంలో ట్రాఫిక్ ఎస్ఐ రామచంద్రం కేసు నమోదు చేసి గురువారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి నాలుగు రోజుల జైలు శిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు. మద్యం తీసుకుని వాహనాలు నడపవద్దని, ట్రాఫిక్ రూల్స్ పాటించాలని ఎస్ఐ రామచంద్రం కోరారు.

అడుగడుగునా దోపిడీ..

- కొండగట్టులో భక్తుల అసహనం

మల్యాల, ఏప్రిల్ 23: కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో మంగళవారం జరిగిన హనుమాన్ చిన్న జయంతి సందర్భంగా భక్తులు అడుగడుగునా దోపిడికి గురయ్యారు. దీంతో వారంతా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన దీక్షాపరుల మాల విరమణ సందర్భంగా కొందరు అర్చకులు డబ్బులు వసూలు చేయడం, తలనీలాలు సమర్పించే చోట క్షురకులు డబ్బులు ఇస్తేనే తలనీలాలు తీస్తామంటూ బలవంతంగా డబ్బులు డిమాండ్ చేశారు. ఎంతో భక్తి ప్రపత్తులతో వస్తే బలవంతంగా వసూలు చేయడమేంటని భక్తులు ఆరోపించారు. కొండపైనా గల హోటల్లలో టిఫిన్‌లకు అధిక వసూళ్లకు పాల్పడ్డారని కొందరూ భక్తులు ఆరోపించారు. స్నానాల కోసం కాంట్రాక్టర్లు రూ.20నుంచి 30వరకు వసూలు చేశారని అంజన్న సన్నిధిలో వ్యాపారులు అధిక ధరలతో తమను నిలువు దోపిడీకి గురి చేశారంటూ కొందరు భక్తులు తెలిపారు.

ఓటు వినియోగించుకోవడం అందరి బాధ్యత

జిల్లా స్వీప్ అసిస్టెంట్ ఎన్నికల అధికారి మదన్

జగిత్యాల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఓటు హక్కును వినియోగించుకోవడం అందరి బాధ్యతగా గుర్తించాలని జిల్లా స్వీప్ అసిస్టెంట్ ఎన్నికల అధికారి మదన్ అన్నారు. మంగళవారం జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయ సమావేశ మందిరంలో సీనియర్ సిటిజన్స్, దివ్యాంగులకు లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఓటింగ్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అర్హులైన ఓటర్లు ఇంటి నుంచే ఓటు వేసే అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి వాణి శ్రీ, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్, నాయకులు విశ్వనాథం, జలజ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బండి సంజయ్..ఆత్మ విమర్శ చేసుకో..

- హిందూ ధర్మం, దేవుళ్ల గురించి నువ్వా మాకు చెప్పేది
- నదుల అనుసంధానం, ప్రజా సమస్యలపై స్పందించు
- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న వినోద్‌కుమార్

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 23: నోటికి ఏది వస్తే అది అర్థరహితంగా మాట్లాడడం కాదు.. ఎంపీగా బండి సంజయ్ ఏం చేశాడో ఆత్మవిమర్శ చేసుకోవాలని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ నదుల అనుసంధానంతో తెలంగాణకు అన్యాయం జరుగుతుందని, దీనిపై ఎంపీ బండి సంజయ్‌కుమార్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గోదావరి జలాలను ఇతర రాష్ట్రాలకు తరలిస్తే ఉత్తర తెలంగాణ ప్రజల బతుకులు ఆగమవుతాయన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఈ నధుల అనుసంధానం ప్రక్రియను నిలిపివేయాలని, గోదావరి జలాల వాటాలను తేల్చాలని వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. కేసీఆర్ ప్రభుత్వాన్ని బదునాం చేయాలనే కాంగ్రెస్ సర్కార్ ఆలోచనతో మేడిగడ్డ వద్ద కాఫర్ డ్యామ్ నిర్మించక పోవడంతో నాలుగునెలల్లో 50 టీఎంసీల గోదావరి జలాలు వృధాగా పోయాయన్నారు. కాఫర్ డ్యామ్ నిర్మించి ఉంటే మిడ్ మానేర్, లోయర్ మానేర్ నిండుకుండల్లా ఉండేవని, సాగు, తాగునీటి ఇబ్బందులుండేవి కాదని తెలిపారు. హిందూ ధర్మం, దేవుళ్లు అంటూ ఎంపీ సంజయ్‌కుమార్ మాట్లాడుతారని, దేవుళ్ల పేరుతో డ్యామ్‌లు, బ్యారేజీలను నిర్మించిన తమకు దేవుళ్ల గురించి చెబుతారా అంటూ మండిపడ్డారు. ధర్మం అంటే తన పని తాను చేయాలని, ఎంపీగా ఏమి చేశాడో తన ధర్మమేమిటో ఆలోచించుకోవాలని సంజయ్‌కి సూచించారు. తెలంగాణలోని పెండింగ్ ప్రాజెక్టుల అనుమతుల కోసం ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామని వినోద్‌కుమార్ స్పష్టం చేశారు. ఈనెల 15న కేంద్ర ప్రభుత్వం గంగా, మహానది, గోదావరి, కృష్ణ, పెన్నా, కావేరి నదుల అనుసంధానం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ఎంవోయూ పత్రాలపై సంతకాలు చేయాలని లేఖలు రాసిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో ఎవరూ పట్టించుకోరని తెలంగాణ జలాలను దోపిడీ చేసేందుకు ఎంవోయూపై లేఖ రాసిందని విమర్శించారు. దీనిపై రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం స్పందన ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రైతాంగం సాగునీటి కోసం ఏళ్ల తరబడి ఇబ్బందులు పడ్డారని, కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో రైతుల బాధలు తొలిగిపోయాయని అన్నారు. గోదావరి జలాలే కరీంనగర్, వరంగల్ జిల్లాల రైతులకు దిక్కని అన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు, నాఫ్‌స్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, మేయర్ యాదగిరి సునీల్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్, అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ కర్ర రాజశేఖర్, కార్పొరేటర్లు మేచినేని అశోక్‌రావు, పుట్ట నరేందర్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

- రైతులను మోసం చేసిన రాష్ట్రప్రభుత్వం.

రైతులను రాష్ట్రప్రభుత్వం అన్ని రంగాల్లో మోసం చేస్తోందని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినిపల్లి వినోద్‌కుమార్ విమర్శించారు. మండలంలోని ముంజంపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతులకు మద్దతు ధరతో పాటు క్వింటాలుకు 500 రూపాయల బోనస్ ఇస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించి, ధాన్యాన్ని విక్రయించిన రెండు రోజులలో రైతుల బ్యాంకు ఖాతాలలో నగదు పడేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, జడ్పీటీసీ తాల్లపల్లి శేఖర్‌గౌడ్, సింగిల్ విండో అధ్యక్షుడునల్ల గోవిందరెడ్డి, మాజీ సర్పంచులు రొడ్డ పృథ్వీరాజ్, రామంచ గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.







సూర్యరథంపై కొలువుదీరిన రాములోరు


ఇల్లందకుంటలో శోభాయాత్ర


సూర్యరథంపై స్వామివారు


ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణలు

● ఇల్లందకుంటలో వైభవంగా శకటోత్సవం

ఇల్లందకుంట, ఏప్రిల్ 23: ఇల్లందకుంట శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయంలో జరిగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా సూర్యరథం (చిన్న రథం)పై స్వామివారు కొలువుదీరారు. మంగళవారం సాయంత్రం ప్రత్యేక పూజ కార్యక్రమం అనంతరం శకటోత్సవం పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు (ఎడ్ల బండ్లు) ప్రదర్శనతో ఆలయం తిరుమాడ వీధుల గుండా ప్రదర్శన చేశారు. స్వామివారిని చిన్నరథంపై కొలువుదీర్చగా ఆలయ మాడ వీధుల గుండా డప్పుచప్పుళ్లు, మంగళవాయిద్యాలు, మేళా తాళాల నడుమ రామనాస్మరణ చేస్తూ ఊరేగించారు.

సైదాబాద్ గ్రామం నుంచి వచ్చిన మేకల బండ్లు ఆలయ మాడ వీధుల గుండా ప్రదర్శించారు. చిన్నరథంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. స్వామివారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.



యువకుడి ఆత్మహత్య

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 23: సిరిసిల్ల పట్టణంలోని బోయవాడకు చెందిన మానుకోల మనోజ్‌కుమార్ (26) అనే యువకుడు ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సిరిసిల్ల టౌన్ సిఐ రఘుపతి వివరాల ప్రకారం.. పట్టణంలోని బోయవాడకు చెందిన మనోజ్‌కుమార్ అగ్రహారం సమీపం లోని ఓ కారు సంస్థలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 21న మనోజ్ తల్లిదండ్రులు ఓ పెళ్లికి హాజరయ్యేందుకు హైద్రాబాద్ వెళ్లారు. పెళ్లికి వస్తానని తల్లిదండ్రులకు చెప్పిన మనోజ్ సోమవారం అర్ధరాత్రి తర్వాత ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని బలవన్మరణానికి ఒడిగట్టాడు. మంగళవారం మధ్యాహ్నం వరకు ఇంటి తలుపులు తీయడం లేదని పక్కింటివారు పిలిచినా ఎవరూ కనిపించకపోవడంతో తలుపులు తీసి లోపలికి వెళ్లిచూస్తే బెడ్‌రూంలో మనోజ్ శవమై కనిపించాడు. ఈ విషయాన్ని వెంటనే అతని తల్లిదండ్రులకు, పోలీసులకు సమాచారం అందించారు. మనోజ్ మృతిచెందాడని తెలుసుకున్న తల్లిదం డ్రులు, సోద రుడు హైద్రాబాద్ నుంచి వచ్చారు. తమ కుమారుడు మనోజ్‌కు గత మూ డు నెలలుగా కార్ల కంపెనీలో వేతనం ఇవ్వకపోవడం వల్లనే మనస్థాపం చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడని తండ్రి శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి కేసు నమో దుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సిఐ రఘుపతి తెలిపారు. కాగా మనోజ్ లోన్‌యాప్ వేధింపుల వల్లనే ఆత్మహత్యకు పాల్పడ్డాడని సోషల్ మీడియాలో వైరల్ అయింది.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఐదుగురికి జైలు


కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 23 : డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఐదుగురు వ్యక్తులకు 3 రోజుల జైలు శిక్ష పడినట్లు కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లాఖాన్ తెలిపారు. మోతాదుకు మించి మద్యం సేవించి తనిఖీలలో ఇటీవల పట్టుబడిన 20 మంది వాహనదారులను మంగళవారం కరీంనగర్ మున్సిఫ్ కోర్టులో హాజరుపరచగా ఐదుగురు వ్యక్తులకు 3 రోజులు జైలుశిక్ష, 10 వేలు జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు వెలువరించారని సీఐ తెలిపారు. మిగతా 15 మంది వాహనదారులకు 27,500 రూపాయల జరిమానా విధించారన్నారు.















రూ.7,400 పలికిన పత్తి ధర

జమ్మికుంట, ఏప్రిల్ 23: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,400 పలికింది. మంగళవారం మార్కెట్ యార్డుకు 20మంది రైతులు 323క్వింటాళ్ల విడి పత్తి, తొమ్మిది మంది రైతులు 16క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7,400, కనిష్ఠ ధర రూ.5,800 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

ధర్మారంలో నగదు పట్టివేత

ధర్మారం,ఏప్రిల్23: ధర్మారం మండల కేంద్రంలోని జక్కన్నపల్లి రాష్ట్ర రహదారిపై మంగళవారం పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఏపీ09టిఎ5072 వాహనాన్ని తనిఖీ చేయగా అందులో ఉన్న కరీంనగర్ మండలం చామనపల్లి గ్రామానికి చెందిన దొమ్మట రాములు అనే వ్యక్తి వద్ద ఎలాంటి ధ్రువపత్రాలు లేకుండా రూ.98,500నగదును స్వాధీనం చేసుకుని ఫ్లయింగ్ స్క్వాడ్‌కు అప్పగించినట్టు ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

ద్విచక్ర వాహనం పైనుంచి పడి యువకుడు మృతి


దేవేందర్ (ఫైల్)

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 23: ద్విచక్ర వాహనం నుంచి పడి యువకుడు మృతి చెందిన సంఘటన మండల శివారులో జరిగింది. మృతుడి కుటుంబ సభ్యులు, పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం మండలంలోని మల్యాల గ్రామ పరిధిలోని జగ్గయ్యపల్లెకు చెందిన ఉప్పుల దేవేందర్ (35) సోమవారం రాత్రి తన సొంత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై జగ్గయ్యపల్లె నుంచి కాల్వ శ్రీరాంపూర్‌కు వచ్చి అదే రోజు రాత్రి తిరిగి వెళుతుండగా మండల కేంద్రం శివారులోని రహదారిపై ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం నుంచి పడి ఉప్పుల దేవేందర్ తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సోమవారం ఉదయం మృతి చెంది ఉన్న ఉప్పుల దేవేందర్‌ను చూసి కుటుంబ సభ్యులకు గ్రామస్థులు సమాచారం ఇచ్చారు. మృతునికి భార్య జ్యోతితో పాటు కుమారుడు ఉన్నాడు. దేవేందర్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఓంకార్ యాదవ్ తెలిపారు.

రెండు కార్లు ఢీ : తప్పిన ప్రమాదం

మానకొండూర్, ఏప్రిల్ 23 : మండలంలోని రంగపేట గ్రామ శివారులో మంగళవారం రెండు కార్లు ఢీకొన్నాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. రంగపేట గ్రామానికి చెందిన మహేందర్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రం నుంచి తన ఇంటికి టిఎస్12ఈడబ్ల్యూ 3994 నెంబరు గల కారులో వస్తుండగా వీణవంక మండలంలోని ఎలబాక గ్రామానికి చెందిన గణేష్ టిఎస్02 ఎఫ్ఈ2505 నెంబరు కారులో వెల్ది నుంచి రంగపేటకు వస్తున్నాడు. మూల మలుపు వద్ద రెండు కార్లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఎవ్వరికి గాయాలు కాకపోవడంతో ప్రమాదం తప్పినప్పటికి కార్లు ధ్వంసం అయ్యాయి.

రెండు ఇసుక ట్రాక్టర్లు ఢీ : ఒకరికి తీవ్రగాయాలు

మానకొండూర్, ఏప్రిల్ 23 : మండలంలోని జగ్గయ్యపల్లి గ్రామంలో రెండు ఇసుక ట్రాక్టర్లు ఢీకొన్న ప్రమాదంలో ఒక్కరికి తీవ్రగాయాలు అయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి మండలంలోని లింగాపూర్ మానేరు వాగు నుంచి ఇసుకను కరీంనగర్‌లో అన్‌లోడ్ చేసి తిరిగి వస్తున్న ట్రాక్టర్, మానేరు వాగు నుంచి ఇసుకతో వెల్లుతున్న మరో ట్రాక్టర్‌ల డ్రైవర్‌లు అతివేగంగా నడుపుతూ జగ్గయ్యపల్లి వద్ద ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో లింగాపూర్‌కు చెందిన రమేశ్‌కు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

పాలకుర్తి,ఏప్రిల్ 23: కన్నాల గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో మంగళవారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు బసంత్‌నగర్ ఎస్ఐ ఆర్ స్వామి తెలిపారు. అయన తెలిపిన వివరాల మేరకు ఆ ప్రాంతంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు గుర్తుతెలియని మృతదేహాన్ని చూసి కన్నాల గ్రామ పంచాయతీ సెక్రెటరీకి చెప్పారని,అతను చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారన్నారు.సెక్రెటరీ ఆషాడపు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. సుమారు 50,60 సంవత్సరాల మధ్య ఉంటుందని, మృతదేహం పూర్తిగా కుళ్లిపోయిన స్థితిలో చెట్టుకుఉరి వేసుకొని వేలాడుతూ ఉందన్నారు. గుర్తుపట్టిన వారు బసంత్‌నగర్ పోలీస్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

బాబ్లీ కోర్టుకు హాజరైన తెలంగాణ ఎమ్మెల్యేలు

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 23: తెలంగాణ రైతుల భూములు సాగునీరు లేక ఎడారిగా మారుతుంటే చూడలేక సాగునీటి కోసం పోరాటంలో భాగంగా మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్టు వద్ద ఆందోళనకు దిగిన కేసులో తెలంగాణకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు కోర్టుకు హాజరయ్యారు. బాబ్లీ కేసు విచారణలో భాగంగా మంగళవారం మహారాష్ట్రలోని బాబ్లీ సెషన్ కోర్టుకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, చింతకింది విజయరమణారావు, మాజీ ఎమ్మెల్యేలు హనుమంతు షిండే, కెఎస్ రత్నం హాజరయ్యారు. అయితే బాబ్లీకి వ్యతిరేకంగా నాడు చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఆందోళన పాల్గొన్న టిడిపి ఎమ్మెల్యేలు ప్రస్తుతం వేర్వేరు పార్టీలో కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా వారు కోర్టులో కలుసుకొని పాత జ్ఞాపకులను గుర్తు చేసుకున్నారు.

యువకుడి దారుణ హత్య


మహిపాల్‌రెడ్డి

మల్యాల, ఏప్రిల్ 23: మండలంలోని రాజారం శివారులో గల ఎస్సారెస్పీ కెనాల్ వద్ద ఓ యువకుడు హత్యకు గురయ్యాడు. మల్యాల ఎస్సై అబ్దుల్ రహీం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రామన్నపేటకు చెందిన ముస్కు మహిపాల్ రెడ్డి(35) అనే యువకుడు చికెన్ సెంటర్‌లలో దినసరి కూలిగా పని చేస్తుంటాడు. సోమవారం సాయంత్రం ఇంట్లో నుంచి వెళ్లిన మహిపాల్ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పలు చోట్ల గాలించారు. మంగళవారం రాజారం ఎస్సారెస్పీ కెనాల్ వద్ద అతని మృతదేహం అనుమానాస్పద స్థితిలో కనిపించింది. గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసి ఆనవాళ్లు గుర్తు పట్టకుండా దహనం చేయడంతో పాటు మృతదేహంపై అరటి పళ్ల డబ్బాలు పెట్టారు. మృతదేహాన్ని గుర్తించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి భార్య జమున ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై పేర్కొన్నారు.

బ్యాంక్ లాకర్ మీద పడి ఒకరికి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 23: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్‌లో నూతనంగా బిగించేందుకు తీసుకువచ్చిన లాకర్‌ను మంగళవారం వాహనంలో నుంచి దింపుతున్న క్రమంలో మీదపడి ఉత్తరప్రదేశ్‌కు చెందిన వ్యక్తి పరమేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కాలు నుజ్జునుజ్జయింది. బ్యాంకులో బంగారం దాచుకునేందుకు లాకర్‌ను ఏర్పాటు చేయడం కోసం బ్యాంకు అధికారులు హైదరాబాద్‌లోని వ్యాపారి వద్ద కొనుగోలు చేశారు. వాహనంలో తీసుకు వచ్చిన లాకర్‌ను దింపుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు పరమేశ్‌పై పడింది. 20 టన్నుల బరువు కల్గిన లాకర్ మీద పడడంతో సుమారు రెండు గంటల పాటు కింద ప్రాణాలతో కొట్టుమిట్టాడాడు. స్థానికులు జేసీబీ తెప్పించి వ్యక్తి పైనున్న లాకర్‌ను తొలగించారు. గాయాల పాలైన పరమేశ్‌ను మొదట సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

మతి స్థిమితం లేని యువతిపై వృద్ధుడి అత్యాచారం

ఓదెల ఏప్రిల్ 23: ఓదెల మండల కేంద్రంలో మంగళవారం మతి స్థిమితం లేని యువతిపై అదే గ్రామానికి చెందిన రాచర్ల రాజమల్లు (70) అనే వృద్ధుడు అత్యాచారానికి పాల్పడ్డట్లు పోలీసులు తెలిపారు. యువతి కుటుంబ సభ్యులు ఉపాధి హామీ పనులకు వెల్లగా ఇంటిలో ఒంటరిగా ఉన్న యువతిపై కన్నేసిన ప్రబుద్ధుడు యువతిపై అత్యాచారం చేశాడు. ఇంతకు ముందు కుడా సదరు యువతిని లైగిక వేధింపులకు గురిచేయగా కాలనీవాసులు బుద్ధి చెప్పారు. యువతి కుటుంబ సభ్యులు ఉపాధి పనులు పూర్తి చేసుకుని ఇంటికి వచ్చిన తర్వాత యువతి తన తల్లికి జరిగిన సంఘటనను వివరించింది. బాధిత కుటుంబం పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, ఎస్ఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

ఎస్‌యూ పీజీ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, ఏప్రిల్ 23: శాతవాహన యూనివర్సిటీ పీజీ మొదటి, మూడో సెమిస్టర్ పరీక్షా ఫలితాలు విడుదల చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్‌వి శ్రీరంగ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు తమ ఫలితాలను www.satavahana.ac.in వెబ్‌సైట్‌లో చూసుకోవాలని సూచించారు.

కొండగట్టు కాషాయమయం

● ఘనంగా హనుమాన్ చిన్న జయంతి ●స్వామిని దర్శించుకున్న వేలాది భక్తులు


ముడుపు కడుతున్న భక్తులు

మల్యాల, ఏప్రిల్ 23: కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో మంగళవారం హనుమాన్ చిన్న జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. జయంతి సందర్భంగా తరలివచ్చిన భక్తజనంతో కొండగట్టు కిక్కిరిసింది. అంజన్న దీక్షాపరుల సంకీర్తనలతో స్వామి పరిసరాలు భక్తి పారవశ్యంతో పులకించాయి. అంజన్న దీక్షాపరులతో కొండగట్టు పుణ్యక్షేత్రం మంగళవారం రాత్రి కాషాయవర్ణాన్ని పులుముకుంది. ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల నుంచి అత్యధిక సంఖ్యలో అంజన్న దీక్షాపరులు కొండపైకి చేరుకుని 41, 21, 11 రోజుల దీక్ష బూనిన వారు మాల విరమణ చేశారు. ఘాట్ రోడ్డు, మెట్లదారుల గుండా వచ్చిన దీక్షాపరులతో కొండంతా భక్తజనంతో నిండింది.

కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో మంగళవారం చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతియేటా చైత్ర పౌర్ణమి సందర్భంగా నిర్వహించే ఈ జయంతిలో భాగంగా అంజన్నకు విశేష అభిషేకం, తులసీ అర్చన, శ్రీ స్వామివారికి పట్టు వస్త్రాలంకరణ నిర్వహించారు. ఈవో చంద్రశేఖర్, ఆలయ స్థానాచార్యులు కపీందర్, ప్రధాన అర్చకులు రామకృష్ణ, జితేంద్ర ప్రసాద్ స్వామి, రఘు ఉపప్రధాన అర్చకులు చిరంజీవి, మారుతీ సిబ్బంది, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మాల విరమణ చేసిన భక్తులు స్వామి వారికి పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు.

● ఎండలు.. ఎన్నికలు..

ఇటీవల వేసవి ఎండలు దంచి కొడుతుండడంతో పాటు లోక్‌సభ ఎన్నికల ప్రభావం హనుమాన్ భక్తులపై పడినట్లైంది అయింది. దీక్షాపరులు, భక్తుల రద్దీ కాస్త తగ్గింది. గతంలో హనుమాన్ జయంతి రోజు, ఒక్క రోజు ముందు లక్షలాదిగా భక్తులు తరలి రాగ ఈ సారి వేలల్లో రావడం ఎండల ఎఫెక్ట్‌గా పేర్కొంటున్నారు. రెండు నెలల క్రితం జరిగిన సమ్మక్క సారక్క జాతర సమయంలో లక్షలాదిగా వచ్చిన భక్తులు అంజన్నను దర్శించుకోగా ప్రస్తుత సమీప ఆలయాల్లోనే మాల విరమణ చేసినట్లు ఆలయ వర్గాలు అభిప్రాయపడుచున్నాయి.

● జయంతిలో పాల్గొన్న కమిషనర్

హనుమాన్ చిన్న జయంతి ఉత్సవాల సందర్భంగా దేవాదాయ కమిషనర్ హనుమంతరావు మంగళవారం జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. స్వామి వారిని దర్శించుకున్నారు. కొండపైన ఏర్పాట్లు పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. కమిషనర్ వెంట ఆలయ ఈవో చంద్రశేఖర్, జాతర ప్రత్యేక అధికారి కృష్ణప్రసాద్, ఆర్డీవో మధుసూదన్ తదితరులు ఉన్నారు. అలాగే చిన్న జయంతి సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అంజన్నను దర్శించుకున్నారు. ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ కొండపైన పర్యటించి పోలీస్ బందోబస్తు చర్యలను పరిశీలించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా, చూడాలని పోలీస్ అధికారులకు సూచనలు చేశారు.


అంజన్న దీక్షాపరులు


రాత్రి వేళ ఆలయం వద్ద భక్తులు


ఆలయంలో భక్తులు


కొండగట్టులో దీక్షాపరులు

ఆర్టీసీ బస్సు కింద పడి భక్తుడి మృతి

కొడిమ్యాల, ఏప్రిల్ 23: కొండగట్టు ఆంజనేయస్వామి చిన్న జయంతి వేడుకల సందర్భంగా మంగళవారం అపశృతి చోటు చేసుకుంది. మండలంలోని డబ్బుతిమ్మయ్యపల్లి గ్రామ శివారులో బొజ్జ పోతన పార్కింగ్ ప్రాంతంలో మంగళవారం అసావత్ లక్ష్మన్(55) వేములవాడ డిపోకు చెందిన ఉచిత ఆర్టీసీ బస్సు ఎక్కుతుండగా కిందపడి తీవ్రగాయాలపాలైనట్లు ఎస్సై సందీప్ తెలిపారు. చేతులకు, తలకు తీవ్రగాయాలు కాగా అతనిని చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికె మృతి చెందాడని వైద్యులు చెప్పినట్లు ఎస్సై తెలిపారు. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం ఎనుగల్లు ఎన్.జీ తండాకు చెందిన అసావత్ లక్ష్మన్, అతని భార్య, కుమారుడు, కోడలు తదితరులు ఆంజనేయస్వామి దర్శనానికి వచ్చారు. తిరుగు ప్రయాణంలో బస్సు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు బస్సు ముందు చక్రాల కింద భక్తుడి కాళ్లు, చేతులు పడ్డాయి. చికిత్స కోసం 108లో కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుని కుమారుడు అసావత్ మొహన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఘటనపై కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.

రాజన్న భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం

● రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు

వేములవాడ, ఏప్రిల్ 23 : శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దర్శనం కోసం వేములవాడకు వచ్చే భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు అన్నారు. మంగళవారం మధ్యాహ్నం ఆయన శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్న అనంతరం విలేకరులతో మాట్లాడారు. శ్రీరామనవమి సందర్భంగా శ్రీ సీతారామచంద్ర కళ్యాణోత్సవాన్ని రాజన్న క్షేత్రంలో ఘనంగా నిర్వహించారని అన్నారు. వేసవికాలంలో భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకొని అందుకు అనుగుణంగా మరిన్ని మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు. దేవాలయానికి సంబంధించిన గోశాలలో కోడెలు మృత్యువాత పడుతుండడం, కొన్ని కోడెలు గల్లంతవ్వడం వంటి విషయాలపై ప్రశ్నించగా తాను దేవాదాయ శాఖ కమిషనర్‌గా కొత్తగా బాధ్యతలు స్వీకరించానని తన దృష్టికి వచ్చిన అంశాలపై విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకుంటానని అన్నారు. ప్రస్తుతం తాను కేవలం శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దర్శనం కోసం మాత్రమే వేములవాడకు వచ్చానని, ఇతరత్రా సమస్యలపై దృష్టి సారించి తగిన చర్యలు తీసుకుంటానన్నారు. ఆలయ ఈవో డి కృష్ణ ప్రసాద్ తదితరులు ఉన్నారు.


కమిషనర్‌కు స్వాగతం పలుకుతున్న ఆలయ అర్చకులు

● అంతకు ముందు వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు దర్శించుకున్నారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడె మొక్కు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు, అధికారులు సంప్రదాయ బద్ధంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ నేతృత్వంలో ఆలయ అర్చకులు ఆశీర్వచనం గావించగా, ఈఓ డి కృష్ణ ప్రసాద్ స్వామివారి చిత్రపటం ప్రసాదం అందజేశారు.

వడదెబ్బతో ఇద్దరి మృతి

● బాలరాజుపల్లిలో రైతు, విలోచవరంలో ఉపాధి కూలీ మృతి

వేములవాడ రూరల్, ఏప్రిల్ 23: వడదెబ్బతో మంగళవారం ఇద్దరు మృతి చెందారు. వేములవాడ మండలంలో ఓ రైతు మృతి చెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం బాలరాజుపల్లి గ్రామానికి చెందిన నాగుల బాలయ్య (55) సోమవారం వ్యవసాయ పనులలో బాగంగా వడ్లు ఆరబోయడానికి వెళ్లాడు. సాయంత్రం అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు వేములవాడలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించాడు. ఇంటికి పెద్దదిక్కును కోల్పోవడంతో కుటుంబ సభ్యుల రోధనలు మిన్నంటాయి. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు. మృతుడికి భార్య దేవేంద్ర, కొడుకు, కూతురు ఉన్నారు.

● మంథని రూరల్ : మండలంలోని విలోచవరం గ్రామంలో ఉపాధి హామీ కూలీ పనులకు వెళ్లి వడదెబ్బతో అక్కపాక లక్ష్మి(55) మంగళవారం మృతి చెందింది. లక్ష్మి గ్రామ శివారులోని ఊర చెరువు వద్దకు పూడిక తీత పనులను ఉదయం 7 గంటల సమయంలో వెళ్లింది. పని ముగించుకొని ఇంటికి వెళ్దామనే సమయంలో సుమారు 10 గంటల సమయంలో ఒక్కసారిగా అస్వస్థతకు గురై కింద పడిపోయింది. ఆమెను గమనించి తోటి కూలీలు నీళ్లు తాగించగా వాంతులు చేసుకుంది. వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందింది. మృతురాలికి భర్త లింగయ్య, ఇద్దరు కొడుకులు ఉన్నారు. వడదెబ్బతో మృతి చెందిన అక్కపాక లక్ష్మి పార్థివ దేహాన్ని పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధు సందర్శించారు. ఎంపీపీ కొండ శంకర్, ప్రజాసంఘాల నాయకులు బూడిద గణేష్, ఆర్ల సందీప్, గోరంకల సురేష్‌లతో పాటు తదితరులు సైతం మృతదేహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మృతికి గల కారణాలను అడిగి తెలుసుకోవడంతో పాటు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. మృతురాలి కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ కూలీ లక్ష్మి మృతి చెందడంతో సంఘటన స్థలాన్ని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రవీందర్‌రాథోడ్, అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్లు సత్యనారాయణ, అమృత్‌కుమార్ పరిశీలించారు.

ఓడేడులో ఈదురుగాలులకు కింద పడ్డ గర్డర్‌లు

● ఈదురుగాలుల బీభత్సం

ముత్తారం ఏప్రిల్ 23: మండలంలోని ఓడేడు, జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం గర్మిల్లపల్లి గ్రామాల మధ్య మానేరు వంతెన గర్డర్లు సోమవారం రాత్రి వీచిన ఈదురుగాలులకు కుప్పకూలి కింద పడ్డాయి. 2016 ఆగస్టులో అప్పటి రోడ్లు భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు రూ.49 కోట్ల నిధులతో చేపట్టిన వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సదరు కాంట్రాక్టర్ పనులు నత్తనడకన సాగిస్తూ కాలయాపన చేశారు. అలాగే గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో సదరు కాంట్రాక్టర్ పనులను నిలిపివేశాడు. మరోమారు రెండో దఫాగా రూ.11కోట్ల నిధులను అదనంగా మంజూరు చేసినప్పటికీ పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు మొదలుపెట్టి కొంత వరకు చేశారు. పిల్లర్ల పైన పెట్టిన గర్డర్‌ల కింది భాగంలో ఉంచిన కర్రలు చాలా కాలంగా అలాగే ఉండంతో చెదలు పట్టి సోమవారం రాత్రి వీచిన ఈదురు గాలులకు కుప్పకూలి కింద పడ్డాయి. రాత్రివేళ కావడం, జన సంచారం లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. కాగా, గత సంవత్సరంలో వచ్చిన భారీ వరదలకు పిల్లర్లు కుంగిపోవడమే కాకుండా కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో భారీ యంత్రాలు ఇసుకలో కూరుకుపోయాయి.

హోటళ్లు, రెస్టారెంట్లలో తనిఖీలు

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 23: ప్లాస్టిక్ వస్తువులు, క్యారీ బ్యాగ్‌ల వినియోగంపై నిషేధం విధించిన నగర పాలక సంస్థ అధికారులు మంగళవారం నగరంలోని పలు హోటళ్లు, రెస్టారెంట్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అసిస్టెంట్ కమిషనర్ జనార్ధన్, మున్సిపల్ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ కె.స్వామి, ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు, కవర్లను వినియోగిస్తున్న హోటళ్ళు, రెస్టారెంట్ల యజమానులపై కేసు నమోదు చేసి 22వేల రూపాయల జరిమానా విధించినట్లు అధికారులు తెలిపారు.

విద్యుత్ సిబ్బందికి ముగిసిన శిక్షణ

గణేశ్‌నగర్, ఏప్రిల్ 23: టీఎస్ఎన్పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో రెండు రోజులుగా సిబ్బందికి కొనసాగుతున్న శిక్షణ మంగళవారం ముగిసింది. ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ ఉద్యోగుల చేత భద్రత నిబంధనలు తప్పకుండా పాటించాలని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్షేత్ర స్థాయి సిబ్బంది విద్యుత్ ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మోటివేషన్, కమ్యూనికేషన్ స్కిల్స్ రిటైర్ ప్రిన్సిపాల్ కెప్టెన్ బుర్ర మధుసూదన్‌రెడ్డి ఒక గంట శిక్షణ ఇచ్చారు.

30 నుంచి ఎంఫార్మసీ పరీక్షలు

గణేశ్‌నగర్, ఏప్రిల్ 23: ఎస్‌యూ పరిధిలోని ఎం.ఫార్మసీ మొదటి సెమిస్టర్ పరీక్షలు ఏప్రిల్30 నుంచి మేనెల 3వ తేదీ వరకు జరగనున్నట్లు ఎస్‌యూ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్‌వి శ్రీ రంగ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

●బి.ఫార్మసీ ఐదవ మరియు ఆరో సెమిస్టర్ పరీక్షలు ఈ నెల30 నుంచి మూడు, నాలుగో సెమిస్టర్ పరీక్షలు మే నెల మొదటి తేదీ నుంచి ప్రారంభం కానున్నట్లు ఎస్ యూ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్ వి శ్రీ రంగ ప్రసాద్ ఒక ప్రకటన లో తెలిపారు. మూడు, ఐదవ సెమిస్టర్ పరీక్షలు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నాలుగు, ఆరో సెమిస్టర్ పరీక్షలు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

వ్యవసాయ మార్కెట్ ఎదుట ఖరీదుదారుల ధర్నా

జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 23: రైతులకు చెల్లించాల్సిన డబ్బులను పోలీస్‌లు పట్టుకోవడాన్ని నిరసనిస్తూ ఖరీద్‌దారులు వ్యవసాయ మార్కెట్ ఎదుట మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు చెల్లించాల్సిన నగదును బ్యాంకు నుంచి డ్రా చేసి తీసుకు వస్తుండగా పోలీస్‌లు పట్టుకున్నారని తెలిపారు. రైతులకు చెల్లించాల్సిన డబ్బులని చెప్పిన కూడా డబ్బులు పట్టుకోవడం బాధాకరం అన్నారు. ఇలా అయితే తాము రైతుల వద్ద పత్తి కొనుగోలు చేయలేమన్నారు. పత్తి విక్రయించిన రైతులకు డబ్బులు ఎలా చెల్లించాలో చెప్పాలన్నారు. స్పందించిన మార్కెట్ కార్యదర్శి గూగులోతు రెడ్యానాయక్ సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో ఖరీద్‌దారులు నిరసన విరమించారు.

ఇళ్ల కూల్చివేత కేసులో ఐదుగురు నిందితుల అరెస్ట్

కరీంనగర్ క్రైం, ఏప్రిల్23: నకిలీ ధ్రువ పత్రాలను సృష్టించి అక్రమంగా పలు ఇళ్లను కూల్చి వేసి స్థానికులను భయభ్రాంతులను గురిచేసిన ఘటనలో ఐదుగురిపై కేసు నమోదు చేసి మంగళవారం రాత్రి రిమాండ్‌కు తరలించామని కరీంనగర్ రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ ఆదర్శనగర్‌కు చెందిన మొహమ్మద్ లతీఫ్ (38) 2017 జూలైలో కరీంనగర్ రేకుర్తిలోని సర్వే నెంబర్ 194లోని 61వ ప్లాట్, 248 చదరపు గజాల ఇంటి స్థలాన్ని, సిద్దిపేట జిల్లా ప్రశాంత్‌నగర్‌కు చెందిన సయ్యద్ జైనాబీ భర్త నిజామొద్దీన్ నుంచి కొనుగోలు చేశాడు. ఈ స్థలంలో ఇంటి నిర్మాణం కోసం సంబంధిత గ్రామ పంచాయతీలో అనుమతి పొంది ఇల్లు నిర్మించుకొని నివాసం ఉంటున్నాడు. 2023 మే 13న విద్యానగర్‌కు చెందిన బారాజు రత్నాకర్‌రెడ్డి, సాయినగర్‌కు చెందిన చందా శంకర్‌రావు, రేకుర్తికి చెందిన బకిట్ సాయి, జ్యోతినగర్‌కు చెందిన పిట్టల మధు, ముకరంపురకు చెందిన షాహిద్‌ఖాన్ అనే ఐదుగురు వ్యక్తులతో పాటు మరి కొంతమంది దౌర్జన్యంగా ఇంట్లో చొరబడ్డారు. బాధితుడి కుటుంబ సభ్యులను బలవంతంగా ఇంటిలో నుంచి బయటకు నెట్టి వేసి, ఆ ఇంటిని ఎక్స్‌కావేటర్‌తో కూల్చివేశారు. పక్కనే కాలనీలో ఉన్న మరికొందరి పేదల ఇళ్లు కూడా కూల్చేసి, మీకు ఈ భూమిపై ఎలాంటి హక్కు లేదని చెబుతూ నకిలీ ధ్రువ పత్రాలు చూపించారు. సయీద్ ఖాన్ వారసులతో డెవలప్‌మెంట్ కింద అగ్రిమెంట్ కూడా అయిందని, దానికి సంబంధించిన ఒక నకిలీ జిరాక్స్ అగ్రిమెంట్ డాక్యుమెంట్ కాపీ చూపించారు. వెంటనే ఇళ్లు ఖాళీ చేయాలని లేదంటే చంపేస్తామని బెదిరింపులకు గురి చేశారు. ఈ మేరకు బాధితుడు లతీఫ్ కొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన కొత్తపల్లి పోలీసులు విచారణ అనంతరం బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు వాస్తవమేనని వెల్లడైనందున ఐదుగురిని అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టాగా 14రోజుల రిమాండ్ విధించారు.

రైతులను మోసం చేసిన కాంగ్రెస్

● కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి

గంగాధర, ఏప్రిల్ 23: రైతులను మోసం చేసిన కాంగ్రెస్ వారిని ఓట్లడిగే హక్కులేదని కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కరీంనగర్ పార్లమెంటు కిసాన్‌మోర్చా సమ్మేళనం గంగాధరలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ డిసెంబరు వరకు రైతులకు 2లక్షల రుణమాఫీ, వడ్లకు 5వందల బోనస్ ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి రైతులకు మొండి చెయ్యి చూపారని ఆరోపించారు. 77ఏళ్ల స్వాతంత్ర్య భారతంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు రైతుల భూములను పాసు బుక్కులో నమోదు చేయలేదని రైతులను ఎలా ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. రెతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చని కాంగ్రెస్‌కు ఓట్లు ఎందుకు వేయాలో జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్ రైతులకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నరేంద్ర మోడీ అభివృద్ధి పనులను బండి సంజయ్ తెచ్చి కరీంనగర్‌లో ప్రారంభిస్తే తానే తెచ్చానని వినోద్‌కుమార్ చెప్పుకోవడం హాస్యాస్పదమన్నారు. కరీంనగర్‌లో భూ కబ్జాలలకు పాల్పడ్డ రౌడీ షీటర్లని ధరణి పేరుతో రైతుల నుంచి గుంజిన లంచాలు వాపస్ ఇచ్చి బీఆర్ఎస్ ప్రచారానికి రావాలన్నారు. తాలు తరుగు పేరుతో రైతు కల్లా వద్ద దోచుకున్న బందిపోటు దొంగలకు వినోద్‌కుమార్,కేటీఆర్,కేసీఆర్ నాయకులని విమర్శించారు. దశాబ్దం పాటు పరిపాలించిన రైతుకు అన్యాయం చేసిన బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులకు చింత బరిగెలతో ప్రజలు తరుముతారని హెచ్చరించారు. రైతులకు ఎకరాకు 30వేల ఎరువుల సబ్సిడీ, ప్రతి రైతుకు ఆరువేల కిసాన్ నిధి, నాణ్యమైన విద్యుత్, పంటకు మద్ధతు ధర పదేళ్లలో 50 శాతం పెంచిన విషయం, రామగుండం లాంటి ఒక్కో ఎరువుల కర్మాగారాన్ని 6500 కోట్లతో పునరుద్ధరించిన విషయాలను కిసాన్ మోర్చా నాయకులు గ్రామగ్రామాన వివరించాలన్నారు. 12వేల కోట్లతో అభివృద్ధిచేసిన బండి సంజయ్‌కుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపించేందుకు కిసాన్ మోర్చా నాయకులు కృషి చేయలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో చొప్పదండి ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు, బీజేపీకిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి క్రిష్ణారెడ్డి,బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మూగ జయశ్రీ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి

కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల అమలు ఏమైంది..?

జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

జగిత్యాల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల హామీ అమలు ఏమైందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ ప్రశ్నించారు. మంగళవారం పట్టణంలోని మోతే రోడ్డులో గల బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో జగిత్యాల కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి దేవుని సాక్షిగా ప్రమాణం చేసి ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని ప్రజలకు మాట ఇచ్చారన్నారు. హామీని అమలు చేయడంలో జీవన్‌రెడ్డి విఫలమయ్యారన్నారు. ఎంపీ ధర్మపురి అర్వింద్ సైతం గతంలో జరిగిన ఎన్నికల్లో పసుపు బోర్డు, ఇతర సమస్యలపై రైతులకు బాండు పేపర్ రాసిచ్చి అమలులో విఫలమయ్యాడని ఆరోపించారు. వీరికి ఓట్లు అడిగే హక్కు లేదని అన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ రెడ్డికి ఓటు వేసి జీవన్‌రెడ్డి, అరవిందలకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. పంట ఉత్పత్తులకు క్వింటాలుకు రూ. 500 అదనంగా బోనస్‌గా అందిస్తామని మాట ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ హామీని నెరవేర్చలేక పోయిందని ధ్వజమెత్తారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, బీఆర్ ఎస్ పట్టణాధ్యక్షుడు గట్టు సతీష్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ డాక్టర్ గొల్లపల్లి చంద్ర శేఖర్ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ నరేంద్రమోదీతోనే సాధ్యం

కొడిమ్యాల, ఏప్రిల్ 23 : ఎస్సీ వర్గీకరణ నరేంద్రమోదీతోనే సాధ్యమని మండల బీజేపీ నాయకులు, జిల్లా ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో బీజేపీ, ఎమ్మార్పీఎస్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బీజేపీ గెలుపె మాదిగల గెలుపు అన్నారు. కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. ప్రస్తుత్త లోక సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మాదిగలకు ఒక్క స్థానం కూడ కేటాయించనందున వారికి ఓటు అడిగె హక్కు లేదన్నారు. ఆత్మ గౌరవం ఉన్న మాదిగలు కాంగ్రెస్‌కు టు వేయవద్దని కోరారు. మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు కరీంనగర్ లోక సభ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బండి సంజయ్‌కుమార్‌కు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని వారు కోరారు. ఈ విలేకరుల సమావేశంలో బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు రేకులపల్లి రవీందర్‌రెడ్డి, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు గంగారాం, ఎమ్మార్పీఎస్ జగిత్యాల, కరీంనగర్, సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు ఎస్. శ్రీను (జగన్), బి. అనిల్, బిక్షపతి, ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి బి. సతీష్ ఉన్నారు.

'ఆదర్శ' పాఠశాలలో ఆంగ్ల భాషా దినోత్సవం

గొల్లపల్లి, ఏప్రిల్ 23 : గొల్లపల్లి మండల కేంద్రంలోని 'ఆదర్శ' పాఠశాలలో ఆంగ్ల భాషా దినోత్సవాన్ని ఇంగ్లీష్ లాంగ్వేజ్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రపంచ ఆంగ్ల భాషా దినోత్సవంను పురస్కరించుకుని ఇంగ్లీష్ ఫెస్టివల్ 2023-24 ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ ఈరవేణి రాజ్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో అవసరమైన ఆంగ్ల భాష నైపుణ్యాలను అందించాలనే లక్ష్యంతో పలు ఆసక్తికర అంశాల్లో పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఇంగ్లీష్ స్పెల్ విజార్డ్ డ్రామాలో జిల్లా స్థాయిలో తమ పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలవడం గర్వకారణమన్నారు. అనంతరం బహుమతులను ప్రదానం చేశారు. ఇంగ్లీష్ లాంగ్వేజ్ క్లబ్ కన్వీనర్ రమణ విద్యార్థుల్లో ఆంగ్ల భాషా పరిజ్ఞానాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఈరవేణి రాజ్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ కొంతం నగేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్, 23 : మండలంలోని బండలింగాపూర్ గ్రామ శివారులోని గండి హనుమాన్ ఆలయంలో సీతారాముల కల్యాణాన్ని పురోహితులు వైభవంగా జరిపారు. మంగళవారం చిన్న హనుమాన్ జయంతి పురస్కరించుకొని గ్రామాల్లోని దేవాలయాల్లో స్వామి వేడుకలు భక్తులు ఘనంగా నిర్వహించారు. బండలింగాపూర్ గ్రామంలో ఉదయం స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు, అలంకరణ, పూజలను వేదపండితుడు మాదవచారి ఆధ్వర్యంలో పురోహితులు జరిపారు. ఆలయం ఈవో విక్రమ్‌గౌడ్ సమక్షంలో స్వామి వారికి ఎదుర్కోలు కార్యక్రమాలను నిర్వహించారు. వేదపండితులు, శాస్త్రత్తంగా సీతారాముల కల్యాణాన్ని జరిపారు. స్వామి వారిని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు దర్శించుకు న్నారు. సాయంత్రం స్వామి వారి పల్లకి సేవ నిర్వహించినంతరం జై శ్రీరామ, జై హనుమాన్ నామ స్మరణాలతో భజన కార్యక్రమాన్ని ఘణంగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయం నిర్వహకులు రేండ్ల గంగాధర్, గంగాధర్, నాయకులు, హనుమాన్ దీక్షపరులు, భక్తులు పాల్గొన్నారు.

జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే 'ఆది'



పూజలు చేస్తున్న విప్ ఆది శ్రీనివాస్

కథలాపూర్, ఏప్రిల్ 23 : మండలంలోని సిరికొండ, కథలాపూర్ గ్రామాల్లో హన్మాన్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని జరిగిన జాతరోత్సవాల్లో మంగళవారం వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. అర్చకులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. భూషణరావు పేట, దూలూరు, చింతకుంట గ్రామాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

గుండెపోటుతో తండ్రి మృతి

అంత్యక్రియలకు హాజరు కాని కొడుకు

భీమారం, ఏప్రిల్ 23: భీమారం మండల కేంద్రానికి చెందిన నాయీబ్రాహ్మణ కులానికి చెందిన ఆరేటి సురేందర్(55) సోమవారం మధ్యాహ్నం గుండెపోటుతో మృతి చెందాడు. సురేందర్‌కు ఒక కొడుకు, ముగ్గురు కూతుళ్లు. పక్షవాతంతో బాధ పడుతూ ఇద్దరు బిడ్డల పెళ్లిళ్లు చేయగా, రెండేళ్ల క్రితం సురేందర్ భార్య లక్ష్మి గుండెపోటుతో మృతి చెందింది. అనంతరం కొడుకు రాజేందర్‌కు పెళ్లి చేయగా జగిత్యాలలో నివాసముంటున్నాడు. ఇటీవల అనారోగ్యానికి గురైన తండ్రి ఆస్పత్రిలో ఉండగా కొడుకు కనికరించలేదు. కుమారుడు రావటం లేదనే మనోవేదనతో గుండెపోటుతో సోమవారం మధ్యాహ్నం మరణించాడు. కన్న తండ్రి చివరి చూపునకు, అంత్యక్రియలకు కూడా కొడుకు హాజరు కాలేదు. దీంతో చేసేదేమీ లేక గ్రామ పెద్ద మనుషులు తన పెద్ద కూతురితో దహన సంస్కారాలు చేయించారు.

గురుకుల సీట్లు సాధించిన విద్యార్థులకు సన్మానం

రాయికల్, ఏప్రిల్ 23: రాయికల్ మండలంలోని కట్కాపూర్ గ్రామంలో గురుకుల సీట్లు సాధించిన విద్యార్థులను, విజ్ఞాన్ కోచింగ్ సెంటర్ చైర్మన్ కాశివేణి రాజేందర్‌ను మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అతి తక్కువ ఫీజుతో ఇప్పటివరకు రాయికల్ మండలం చుట్టుపక్కల విద్యార్థులకు విజ్ఞాన్ కోచింగ్ సెంటర్ ద్వారా నిరుపేద విద్యార్థులు 280 మందికి సీట్లు వచ్చాయని అన్నారు. మాజీ సర్పంచ్ ముద్దసాని రాజమౌళి, మార రాజరెడ్డి, న్యాయవాది మదం మల్లేష్, రంజిత్, రాజు, ఆంజనేయులు, వినోద్, అంజి, అనిల్, మహేష్, మహేష్, నితిన్ పాల్గొన్నారు.

మలేరియాతో జర పైలం



● నిర్లక్ష్యం చేస్తే తప్పదు అనారోగ్య ముప్పు ● ముందు జాగ్రత్త చర్యలతో రక్షణ ● రేపు ప్రపంచ మలేరియా దినం

జగిత్యాల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): జ్వరమే కదా అని తేలిగ్గా తీసుకుంటే అది మలేరియా కావచ్చు.. ప్రాణాంతకంగా మారొచ్చు.. సరియైన సమయంలో సరియైన చికిత్స తీసుకుంటే ప్రమాదం నుంచి బయటపడ వచ్చని వైద్యులు సూచిస్తున్నారు. కానీ వ్యాధి బారిన పడకుండా ముందస్తుగా తీసుకోవాల్సిన చర్యలు అత్యంత ముఖ్యమని చెబుతున్నారు. 25వ తేదీన ప్రపంచ మలేరియా దినం సందర్భంగా ప్రత్యేక కథనం.

● వ్యాధి ఇలా సోకుతుంది...

ఎనాఫిలిస్ అనే ఆడదోమ కుట్టినప్పుడు మనిషి శరీరంపై ప్లాస్మోడియం పారసైట్ అనే పరానన జీవిని వదులుతుంది. దోమకాటు వల్ల ఏర్పడిన రంధ్రంలో నుంచి మనిషి రక్తంలోకి పరాన్న జీవి ప్రవేశించి విస్తరిస్తుంది. ఈ పరాన్నజీవి రక్తంలోని రోగ నిరోదక వ్యవస్థగా ఉన్న ఎర్ర రక్త కణాలపై దాడి చేస్తుంది. దీని మూలంగా మనిషికి రోజు విడిచి రోజు జ్వరం సోకు తుంది. సరియైన సమయయంలో చికిత్స తీసుకోని పక్షంలో రోగనిరోదక వ్యవస్థ దెబ్బ తిని రోగికి ప్రాణాంతకమవుతుంది. సుమారు 20 రకాల ఎనాఫిలిస్ దోమలు మలేరియా వ్యాప్తికి కారణమవుతున్నాయి.

● ప్రధానంగా నాలుగు రకాల దోమల వల్ల..

మలేరియా వ్యాప్తికి ప్రపంచంలో ప్లాస్మోడియం వైవాక్స్, ప్లాస్మోడియం ఫాల్సిపెరం, ప్లాస్మోడియం మలేరియా, ప్లాస్మాడియం ఓవెల్ అనే నాలుగు రకాల పరాన్న జీవులు వ్యాధి తీవ్రతకు కారణమవుతున్నాయి. ఎక్కువగా ప్లాస్మోడియం వైవాక్స్, ప్లాస్మోడియం పాల్సిపెరం అను రెండు రకాల పరాన్న జీవులు కారణమవుతున్నాయని వైద్యులు అంటున్నారు. వీటిలో ప్లాస్మోడియం అనే పరాన్న జీవి మలేరియా వ్యాధి తీవ్రతను పెంచి ప్రాణాంతకంగా మారు తోంది. నీరు నిల్ల ఉండే పంపులు, ఇతర నీటి పాత్రలు, మురుగునీటి నిల్వ ప్రదేశాలు వ్యాదికారక దోమలకు ప్రధాన కేంద్రాలు మారుతున్నాయన్న ప్రచారం ఉంది. వీటిలో దోమలు ఆవాసాలు ఏర్పాటు చేసుకొని గుడ్లు పెట్టి సంతానోత్పత్తి చేస్తాయి. ఇవి పెరిగి వ్యాధి కారకంగా మారుతాయి.

● సమాజపరంగా తీసుకోవాల్సిన చర్యలు..

గ్రామములోని వీధులన్ని శుభ్రముగా ఉంచాలి. మురుగు కాలువలు, డ్రైనేజీలు, చెత్తాచెదారము తొలగించాలి. వర్షాలకు ముందు తరువాత ము రికి కాలు వల్లో పూడిక తీత చేపట్టాలి. నీరు పారునట్లుగా చూడాలి. గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, సామాజిక కార్యకర్తలు నాయకులు మలేరియా రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంలో ప్రధాన భాగస్వామ్యం కావాలి. వ్యాధులు ప్రబలినప్పుడు, స్థానిక ఆరోగ్య సిబ్బందికి వెంటనే తెలియ జేసి సలహాలు, సూచనలు పాటించాలి. ఈ మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక కరపత్రాలను ముద్రించి గ్రామాలు, పల్లెల్లో విస్తృతంగా ప్ర చారం నిర్వహిస్తోంది.

● 2007లో డబ్ల్యూహెచ్‌వో నిర్ణయం...

ఆఫ్రికా ఖండంలోని పలు దేశాల్లో మలేరియా కారణంగా 2006లో వేలాది మంది చిన్నారులు మృత్యువాత పడ్డారు. వ్యాధి తీవ్రతను గుర్తించిన ప్రపంచ ఆరోగ్య సంస్థ 2007లో జరిగిన తమ నిర్ణయాల రూపకల్పన కమిటీ, వరల్డ్ హెల్త్ అసెంబ్లీ 60వ సమావేశాల్లో ఈవిషయంపై చర్చించి ప్రతి యేటా ఏప్రిల్ 25వ తేదీన ప్రపంచ మలేరియా దినోత్సవంగా జరుపుకోవాలని నిర్ణయించింది. 2015లో జరిగిన ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆధ్వర్యంలోని వరల్డ్ హెల్త్ అసెంబ్లీ సమావేశాల్లో 2038 నాటికి మలేరియా కేసులు, మరణాలను ప్రపంచ వ్యాప్తంగా 90 శాతం తగ్గించాలని లక్ష్యంగా నిర్ణయించింది.

● నివారణ మార్గాలివి...

మలేరియా వ్యాధి రాకుండా నివారించడానికి ఎటువంటి టీకా మందులు లేవు. కేవలం దోమకాటు నుంచి రక్షించుకోవడమే ప్రధాన మార్గము. మురుగు నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో కాలిన ఇంజిన్ ఆయిల్, కిరోసిన్, డీడీటీ పౌడర్ పిచికారి చేయాలి. 5 మిల్లీ లీటర్ల టెమిపాస్ 50 శాతం ఈసీ మందును 20 లీటర్ల నీటిలో కలిపి మురుగు కాల్వలు, వర్షపు నీటి గుంతలు, బోర్లు, నల్లా వద్ద ఏర్పడే నీటి గుంతలు, ఖాళీ చేయలేని నీటి నిల్వ సంపులు, డ్రమ్ములలో పంచాయతీ సిబ్బంది పిచికారి చేయాలి. ఈ ద్రావణం తిను బండా రాలపై పడకుండా చర్యలు తీసుకోవాలి. కూలర్లు, పూల కుండీలు, నీటి డ్రమ్ములు, వాటర్ ట్యాంకుల్లో లార్వా పెరుగుతుంది. వీటిలో నీటిని మారుస్తూ ఉండాలి, సంపులపై, ట్యాంకులపై మూతలు పెట్టాలి. వారానికి ఒకసారైనా శుభ్రం చేయడం వల్ల లార్వా ఉంటే చనిపోతుంది. పాత టైర్లు, పాత్రలు, కొబ్బరి చిప్పలు వంటివి పరిసరాల్లో ఉండ కుండా చూడాలి. ఇంట్లో కర్టెన్లు తరుచూ మారుస్తూ ఉండాలి. కిటికీలకు జాలీలను అమర్చు కోవడం ద్వారా దోమలు ఇంట్లోకి రాకుండా నివారించవచ్చును.

● జిల్లాలో మూడేళ్లుగా మలేరియా నిల్...

జిల్లాలో గడిచిన మూడు సంవత్సరాలుగా మల్లేరియా కేసులు నమోదు కావడం లేదు. జిల్లాలో 2019 సంవత్సరంలో 97,483 మంది బ్లడ్ శాంపిల్స్ సేకరించగా 4 కేసులు నిర్ధారణ అయ్యాయి. 2020 సంవత్సరంలో 1,10,396 మంది రక్త నమునాలు సేకరించగా ఒక్కరికి నిర్ధారణ అయింది. 2021లో 86, 404 మంది రక్త నమూనాలు, 2022ల 1,02,281 మంది రక్త నమూనాలు, 2023లో 1,06,498, 2024 జనవరి మాసాంతం వరకు 9,828 మంది రక్త నమూనాలు సేకరించగా మలేరియా కేసులను గుర్తించలేదని వైద్య ఆరోగ్య శాఖ రికార్డులు చెబుతున్నాయి.

ముందస్తు జాగ్రత్తలపై ప్రచారం చేపడుతున్నాము

డాక్టర్ శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్‌వో



మలేరియా సోకకుండా ఉండడానికి ముందస్తు జాగ్రత్తలపై విస్తృత ప్రచారం చేపడుతున్నాము. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించడంతో పాటు ఇళ్లలో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటున్నాము. ఎప్ప టికప్పుడు ఆరోగ్య సిబ్బంది పల్లెలు, పట్టణాల్లో పర్యటిస్తూ ప్రజలను చైతన్య వం తులను చేస్తున్నారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి



వరి ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ రాంబాబు

గొల్లపల్లి, ఏప్రిల్ 23 : యాసంగి వరి ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని అడిషనల్ కలెక్టర్ పి. రాంబాబు నిర్వాహకులను ఆదేశించారు. మంగళవారం గొల్లపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో, చెందోళిలోని సింగిల్‌విండో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లో పలువురు రైతులను వరి ధాన్యం విక్రయంలో ఎదుర్కొంటున్న సమస్యలపై అడిగితెలుసుకున్నారు. పలువురు రైతులు కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయని, మ్యాచర్ రావడం లేదంటూ తూకం వేయడం లేదంటూ రైతులు అడిషనల్ కలెకర్‌తో గోడు వెళ్లబోసుకున్నారు. దీనికి కలెక్టర్ స్పందిస్తూ వరి ధాన్యంను ఆరబెట్టి, శుద్ధి చేసిన అనంతరం తేమ శాతం తక్కువ ఉన్నప్పుడే ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, దీనికి ప్రభుత్వం గిట్టుబాటు ధర చెల్లిస్తుందన్నారు. కొనుగోళ్లు సక్రమంగా, సజావుగా సాగాలంటే రైతులు సహకరించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని నిర్వాహకులను ఆదేశించారు. అనంతరం అబ్బాపూర్‌లోని సాంబశివ రైస్ మిల్లును అడిషనల్ కలెక్టర్ తనిఖీ చేశారు. ప్రభుత్వరంగ సంస్థలు కొనుగోలు చేసిన వరి ధాన్యం బస్తాల లోడులను త్వరితగతిన దించుకోవాలని, ఆన్‌లో డింగ్‌లో జరుగుతున్న జాప్యాన్ని సహించేది లేదని హెచ్చరించారు. తహసీల్దార్ మహ్మద్ జమీర్, సివిల్ సప్లై నాయబ్ తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ జీవన్, సీఈవో రాంసుధాకర్ రావు, రైతులు పాల్గొన్నారు.

ధర్మపురిలో దేవాదాయ శాఖ కమిషనర్ పూజలు



దేవాదాయ కమిషనర్‌కు స్వాగతం పలుకుతున్న ఆలయ ఈవో, అర్చకులు

ధర్మపురి, ఏప్రిల్ 23: ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయాన్ని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ, సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ ఎం. హనుమంతరావు మంగళవారం ఉదయం సందర్శించారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం మంగళ వాయిద్యాలు వెంట రాగా వేదపండితులు, అర్చకులు, సిబ్బంది ఆయనకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ మంత్రోచ్ఛరణల మధ్య ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, అర్చకులు ఆయనను ఘనంగా ఆశీర్వదించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఆయనకు స్వామి శేష వస్త్రం, ప్రసాదాలు, చిత్రపటం బహూకరించి సత్కరించారు. ఆయన వెంట ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, పాలెపు ప్రవీణ్‌కు మార్‌శర్మ, తహసీల్దార్ కృష్ణచైతన్య, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో ధర్మపురి ఆలయం

ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం ఎంతో అభివృద్ధి చెందిందని రాష్ట్ర దేవాదాయ, ధర్మాధాయ, సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ హనుమంతరావు అన్నారు. స్వామి దర్శనం అనంతరం ఆయన కొద్ది సేపు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ధర్మపురి గోదావరి పరివాహక ప్రాంతంలో గల పుణ్య క్షేత్రానికి భక్తులు దర్శనం కోసం వస్తుంటారని ఆయన పేర్కొన్నారు. రాబోవు కాలంలో దేవాలయంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని ఆయన అన్నారు.

12 అడుగుల హనుమాన్ విగ్రహావిష్కరణ

రాయికల్, ఏప్రిల్ 23: రాయికల్ మండలంలోని ఇటిక్యాల గ్రామంలో హనుమాన్ జయంతిని పురస్కరించుకుని సింగని వీరేందర్-సౌజన్య, చౌడారపు చంద్రశేఖర్- శ్వేత, దాతల సహకారంతో 12 అడుగుల భారీ హనుమాన్ విగ్రహాన్ని మంగళవారం ఆవిష్కరించారు. పండితులు శివ శంకర శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించగా, భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో దాతలు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, దీక్షాపరులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

స్వగ్రామం చేరుకున్న మృతదేహం

బీర్‌పూర్,ఏప్రిల్ 23: జీవనోపాధి కోసం గల్ఫ్ దేశానికి వెళ్లి ఈ నెల 4న గుండెపోటుతో మరణించిన యువకుడి మృతదేహం మంగళవారం స్వగ్రామానికి చేరింది. బీర్‌పూర్ మండలంలోని నర్సింహులపల్లి గ్రామానికి చెందిన సూధ వినయ్ కుమార్(40) జీవనోపాధి నిమిత్తం మూడు నెలల క్రితం సౌదీ అరేబియా దేశానికి వెళ్లాడు. గల్ఫ్ కార్మికుడిగా వెళ్లిన విజయ్ ఇంటి డ్రైవర్‌గా పనిలో చేరాడు ఈ నెల 4నా గుండె పోటుతో మరణించాడు. మృతుడు వినయ్ మృతదేహం స్వగ్రామానికి వచ్చిందన్న విషయం తెలుసుకున్న జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మృతుడి కుటుంబాన్ని పరామర్శించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. అంతకు ముందుగా బీర్‌పూర్ గ్రామంలోని నాయకపు గూడెంకు చెందిన బద్ది లింగన్న ఇల్లు ప్రమాదవశాత్తు కాలిపోగా వారి కుటుంబాన్ని పరామర్శించి ఆదుకుంటామని భరోసా కల్పించారు. ఆయన వెంట కేడీసీసీ జిల్లా మెంబర్ ముప్పాల రాంచందర్ రావ్, మాజీ ఎంపీపీ కొల్ముల రమణ, ఎంపీటీసీ సృజన సుశీన్, మెరుగు రాజేశం, శీలం రవి ఉన్నారు.

భక్తులకు మజ్జిగ అందించిన మంత్రి పొన్నం

మల్యాల, ఏప్రిల్ 23: ఆంజనేయ స్వామి సన్నిధిలో జరుగుతున్న హనుమాన్ చిన్న జయంతి సందర్భంగా వచ్చే భక్తుల కోసం మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ తన తండ్రి స్వర్గీయ పొన్నం సత్తయ్యగౌడ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్యాంకర్ మజ్జిగను పంపించారు. ఈ మేరకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మజ్జిగ పంపిణీ ప్రారంభించి భక్తులకు అందించారు. ఈ కార్యక్రమంలో ముత్యం శంకర్, కంచర్ల లక్ష్మనాచారీ, గంగాధర్, విక్రం, నిఖిల్, అరుణ, మమత, మంజుల, మన్విత్‌రెడ్డి పాల్గొన్నారు.

●కరీంనగర్‌కు చెందిన శ్రీవర సిద్ది వినాయక సేవా సమితి ఆధ్వర్యంలో ప్రకాశం గంజ్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో భక్తులకుఉచిత అన్న ప్రసాద వితరణ చేశారు. ఎనిమిది ఏళ్లుగా కొండపైన చిన్న, పెద్ద హనుమాన్ జయంతి ఉత్సవాల సందర్భంగా రెండు రోజుల పాటు రోజంతా వేలాది మందికి అన్నదానం చేస్తునే ఉంటున్నారు.

ఘనంగా ప్రారంభమైన బీమన్న జాతర

మల్లాపూర్, ఏప్రిల్, 23 : మండలంలోని మొగిలిపేట గ్రామంలోని బీమన్న జాతర వేడుకలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచి ఆలయంలో స్వామి వారికి పురోహితులు ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరిపారు. రాత్రి సామి వారి కల్యాణ వేడుకలు సంప్రదాయంగా జరపనున్నట్లు నిర్వహకులు తెలిపారు. మండలంలోని గ్రామాల నంచి భక్తులు జాతర వేడుకల్లో పాల్గొని స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు. జాతరలో భాగంగా బుధవారం నిర్వహించే రథోత్సవ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి కృపాకు ప్రార్థులు కావాలన్నారు.

జిల్లా కార్యవర్గం ఏర్పాటు

కోరుట్ల, ఏప్రిల్ 23 : బీజేపీ జిల్లా ఓబీసి మోర్చా కార్యవర్గ సభ్యుడిగా తులసి కృష్ణను నియమిస్తూ మంగళవారం మోర్చా జిల్లా అధ్యక్షుడు కొక్కు గంగాధర్ ప్రకటించి నియమకప్రతం అందించినట్లు బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కస్తూరి లక్ష్మీనారాయణ, పద్మశాలి సంఘ జిల్లా అధ్యక్షుడు, బీజేపీ కార్యవర్గ సభ్యుడు రుద్ర శ్రీనివాస్ తెలిపారు. నూతనంగా నియామకం పొందిన ఓబీసి మోర్చా కార్యవర్గ సభ్యుడు తులసి కృష్ణ మాట్లాడుతూ తన నియామకానికి సహకారం అందించిన జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, ఎంపీ అర్వింద్‌లతో పాటు జిల్లా స్థానిక నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎల్లమ్మ ఆలయంలో చోరీ

మల్లాపూర్, ఏప్రిల్, 23 : మండలంలోని ఓబులాపూర్ గ్రామంలోని ఎల్లమ్మ ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరికి పాల్పడినట్లు ఎస్సై కిరణ్ కుమార్ మంగళ వారం తెలిపారు. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం..సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తు ఎల్లమ్మ ఆలయం తలుపులు పగలగొట్టి లోపలికి చొరబడి అమ్మ వారి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. మంగళవారం ఉదయం ఆలయం వద్దకు గ్రామస్థులు వెళ్లగా తులుపు తెరిచి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటన స్థలాన్ని పోలీసులు సందర్శించారు. దొంగిలించిన ఆభరణాలు సుమారు తులం బంగారం ఉటుందన్నారు. గీతకార్మిక సంఘం నాయకుడు బక్కన్న ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులు సమాజ సేవ చేసే స్థాయికి ఎదగాలి

ట్రస్మా జిల్లా అధ్యక్షుడు బోయినిపల్లి శ్రీధర్‌రావు



సూర్య గ్లోబల్ స్కూల్‌లో నృత్య ప్రదర్శనలు ఇస్తున్న విద్యార్థులు

జగిత్యాల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు భవిష్యత్తులో సమాజ సేవ చేసే స్థాయికి ఎదగాలని ట్రస్మా జిల్లా అధ్యక్షుడు బోయినిపల్లి శ్రీధర్ రావు అన్నారు. మంగళవారం పట్టణంలోని సూర్య గ్లోబల్ స్కూల్‌లో నిర్వహించిన సూర్య షైనింగ్ మూమెంట్స్ 2024 పేరిట కల్చరల్ మీట్‌కు ఆయన హాజరయ్యారు. పాఠశాలలో సాంస్కృతి కార్యక్రమాలను ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు దేశ భక్తి, సినీ, జాన పద గేయాలపై విద్యార్థులు ఇచ్చిన పలు నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు బోయినిపల్లి శ్రీధర్ రావు - రజిత, బియ్యాల హరిచరణ్ రావు, జువ్వాడి మౌనికా హరిచరణ్ రావు, ఉపాధ్యాయినీ పాల్గొన్నారు.

●పట్టణంలోని మానస స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో వైభవ్ ది మానస అన్యువల్ ఫెస్ట్ 2024 పేరిట గురువారం నిర్వహించిన వార్షికోత్సవ వేడుకల్లో విద్యార్థులు ఇచ్చిన నృత్య ప్రదర్శనలు అలంరించాయి. ప్రిన్సిపాల్ రజిత రావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకొని విద్యార్థులచే హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు శ్రీధర్ రావు, హరి చరణ్‌రావు, మౌనిక రావు, సుమన్ రావు, విద్యార్థులు, తల్లి దండ్రులు పాల్గొన్నారు.

రాయికల్: రాయికల్ పట్టణంలోని ఆర్‌ఆర్ గార్డెన్‌లో మంగళవారం వికసిత-2024 పేరుతో నిర్వహించిన కృష్ణవేణి టాలెంట్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు పలువురికి ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ వేణుగోపాల్ రావు, కరస్పాండెంట్ తిరుపతి రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

●విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని ఆ దిశగా పయనించాలని రాయికల్ తహసీల్దార్ ఎంఏ ఖయ్యూం అన్నారు. రాయికల్ పట్టణంలోని విశ్వశాంతి ఉన్నత పాఠశాల వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన తహసీల్దార్ మాట్లాడుతూ విద్యార్థులను విద్యాపరంగా కాకుండా కలలపరంగా రాణించే విధంగా తీర్చిదిద్దిన పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. పాఠశాలలో చదివిన 2002-03 విద్యా సంవత్సరానికి పాఠశాల విద్యను అభ్యసించిన పదవ తరగతి విద్యార్థులు పేద విద్యార్థి కొడిమ్యాల రుచితకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.15 వేల ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మచ్చ గంగాధర్‌లలిత, విద్యాన్వేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నృత్యాలు చేస్తున్న విద్యార్థులు